సాక్షి
కుమురం భీం
సోమవారం । 7 । ఆగస్టు । 2023



ఆధునిక హంగులతో రైల్వే అభివృద్ధి
ఆదిలాబాద్ రైల్వేస్టేషన్ ఏబీఎస్ఎస్ కింద ఎంపికైంది. ఆదివారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారు. 8లో▸



కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె
సమస్యల పరిష్కారం కోసం పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. ఆదివారం కలెక్టరేట్ ఎదుట కార్మికులు నిరసన తెలిపారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
32.4 /26.3

వాతావరణం
ఆకాశం చాలా వరకు మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఉక్కపోతగా అనిపిస్తుంది. ఒకటి రెండు చోట్ల చినుకులు పడతాయి.

న్యూస్‌రీల్

'వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి'

ఆసిఫాబాద్‌అర్బన్: కాళేశ్వరం ప్రాజెక్టుతో ప్రజలకు ఎలాంటి నష్టం లేదని శాసనసభలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ప్రకటించడం సరికాదని, బాధ్యతగా వ్యవహరించాల్సిన వారు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు భుక్యా గోవింద్‌నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అవగాహన లేకుండా బాధ్యతారహితంగా మాట్లాడటాన్ని ఆయన ఖండించారు. కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద కట్టాల్సిన ప్రాజెక్టును సొంత లాభాల కోసం సీఎం వేరేచోటుకు తరలించారని ఆరోపించారు. సీఎం కేసీఆర్ మెప్పు పొందేందుకు ప్రజాప్రతినిధులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ అవినీతిని ప్రజలు గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో గుణపాఠం చెబుతారన్నారు.

రేపు ఇంటర్వ్యూలు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ లెక్చరర్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 8న ఉదయం 10 గంటలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు.

కార్మిక దీక్షకు తరలిరావాలి

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్‌- కాగజ్‌నగర్ పేపరు మిల్లు కార్మికులకు సంఘీభావంగా మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న కార్మిక దీక్షకు అన్నివర్గాల నుంచి తరలిరావాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాల్వాయి హరీశ్‌బాబు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ నెల 8న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్మిక దీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. దగా పడ్డ కార్మికులు, ఉద్యోగులు పెద్దఎత్తున దీక్షలో పాల్గొని తమ హక్కుల సాధనకు నడుం బిగించాలని పిలుపునిచ్చారు.

ఘనంగా జాగృతి ఆవిర్భావ దినోత్సవం



ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలో ఆదివారం భారత జాగృతి 17వ ఆవిర్భావ వేడుకలు జిల్లా అధ్యక్షుడు పర్శ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అలాగే ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జాగృతి పతకాన్ని ఆవిష్కరించారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ స్వరాష్ట్ర సాధనే ఊపిరిగా, చివరివరకు పోరాడిన మహానుభావుడు ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. 2006లో జయశంకర్ స్ఫూర్తితో తెలంగాణ జాగృతిని స్థాపించారని పేర్కొన్నారు. ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధిగా జాగృతి నిలుస్తుందన్నారు. ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిర్పూర్ తాలూకా అధ్యక్షుడు డోకె దామోదర్, నాయకులు మాచర్ల వినోద, మల్లీశ్వరి, శ్రీనివాస్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

'కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వాలు'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నాయకులతో కలిసి మహాధర్నాపోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 9, 10 తేదీల్లో నిర్వహించనున్న మహాధర్నాను కార్మికులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం రవీందర్, జేఏసీ నాయకులు సుధాకర్, రమేశ్, వెంకటి, శంకర్, బాబాజీ, ప్రకాశ్, గోపాల్, లక్ష్మి, శోభ తదితరులు పాల్గొన్నారు.

ఆయన గజ్జె కట్టి ఆడితే.. జనం గుండె ఝల్లుమంటుంది.. గొంతు విప్పి పాడితే.. చైతన్యం ఉప్పొంగుతుంది.. మాట్లాడితే అణగారిన వర్గాలకు ఒక ఆశాకిరణం అవుతుంది. ప్రశ్నించే పాట.. అన్యాయాన్ని ఎదురించే మాట ఆయన సొంతం. నక్సల్స్ ఉద్యమం ఊపిరి పోసుకున్న సమయంలో జననాట్యమండలిని స్థాపించిన వారిలో గద్దర్ ఒకరు. బడుగు, బలహీన వర్గాల్లో చైతన్యం తీసుకురావడానికి తన పాటనే ఆయుధంగా మలుచుకుని ప్రజా యుద్ధ నౌకగా గుర్తింపు పొందిన గద్దర్‌కు ఉమ్మడి జిల్లాతో ప్రత్యేక అనుబంధం ఉంది. ఈ ప్రాంతానికి చెందిన అనేక మంది ప్రజానాట్యమండలిలో పనిచేశారు. ముఖ్యంగా కోల్‌బెల్ట్ ఏరియాలో సింగరేణి శ్రమదోపిడీని ప్రశ్నించిన గద్దర్ కార్మికుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. నాడు బొగ్గుబాయిలపై ఏ మీటింగ్ నిర్వహించినా ఆయన పాటే మార్మోగేది. ఆదివాసీల తిరుగుబాటు గడ్డ ఇంద్రవెల్లిలో అడుగుపెట్టి గిరి పుత్రులను చైతన్య పరిచారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమంలోనూ కీలకపాత్ర పోషించారు. నిర్బంధాలను ఛేదించుకుంటూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజలను తన పాటలతో ఏకతాటిపై నడిపించారు. సభలు, సమావేశాలు, ధూంధాం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉద్యమంలో ఎంతో మంది ఈ ప్రాంత కళాకారులు గద్దర్‌తో ఆడిపాడిన సందర్భాలున్నాయి. కొంతకాలంగా గద్దర్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆసుపత్రిలో ఆయన కోలుకుంటున్నారని శనివారం రాత్రి ప్రకటన రావడంతో మంచిర్యాల జిల్లాలోని ముఖ్య కళాకారులందరూ సోమవారం శివాలయంలో 108 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకోవాలని అనుకున్నారు. ఇంతలోనే గద్దర్ ఇక లేరనే వార్త తెలియడంతో శోకసంద్రంలో మునిగిపోయారు. గద్దర్‌తో తమకున్న అనుబంధాన్ని ఈ ప్రాంతవాసులు గుర్తు చేసుకుంటున్నారు. ప్రముఖ సాహితీవేత్త 'సామల'తో స్నేహబంధాన్ని కలిగిన గద్దర్.. సదాశివ వర్ధంతి రోజునే మరణించడం యాదృచ్ఛికం.



సేవ్ సింగరేణి యాత్రలో గద్దర్ (ఫైల్)

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాపై గద్దర్ చెరగని ముద్ర
- ఎంతో మందితో సాన్నిహిత్యం
- ప్రజల గొంతుకై గర్జించిన జ్ఞాపకాలెన్నో..
- ధూంధాంతో జనాల్లో చైతన్యం



బెల్లంపల్లిలో..



మంచిర్యాలలో ఆటాపాట..



గూడ అంజయ్యకు నివాళులర్పిస్తూ ..

అడవుల జిల్లా మదిలో..

మంచిర్యాల జిల్లాలో..

మంచిర్యాలఅర్బన్/బెల్లంపల్లి/పాతమంచిర్యాల/దండేపల్లి/నస్పూర్:

- మంచిర్యాల బైపాస్ రోడ్ రంగంపేట్ చౌరస్తాలో 2008, జూలై 03న గద్దర్ అమరువీరుల స్తూపానికి శంకుస్థాపన చేయగా, 2014 జూలై 6న తెలంగాణ అమరుల కుటుంబాలతో స్థూపావిష్కరణ గావించారు. తెలంగాణ తొలిదశ ఉద్యమంలో గన్‌పార్క్ వద్ద నిర్మించగా మలిదశ ఉద్యమంలో అమరవీరుల త్యాగానికి గుర్తుగా మంచిర్యాలలో నిర్మించారు. ఇంద్రవెల్లి, రాంజీగోండు, జోడేఘాట్, కుమురంభీం, చాకలి అయిలమ్మ, దొడ్డి కొమురయ్య నేలకొరిగిన ప్రాంతాల నుంచి మట్టిని తీసుకువచ్చినట్లు నిర్మాణం చేపట్టినట్లు అప్పటి ప్రజాఫ్రంట్ జిల్లా కన్వీనర్ శ్రీమన్నారాయణ తెలిపారు.
- దండేపల్లి మండలం లింగాపూర్‌కు చెందిన విప్లవ కవి, గాయకుడు గూడ అంజయ్య, 2016, జూన్ 21న మరణించడంతో, ఆయన అంతిమ యాత్రలో పాల్గొనేందుకు జూన్ 22న గద్దర్ లింగాపూర్‌కు విచ్చేశారు. అంజన్నతో తనకు ఉన్న బంధాన్ని గుర్తుచేసుకున్నారు.
- ఈ ఏడాది ఏప్రిల్ 14న నస్పూర్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సత్యాగ్రహ సభలో గద్దర్ పాల్గొన్నారు. ఈ సభలో కళాకారులతో కలిసి ఆడిపాడి అలరించారు. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో ఉమ్మడి జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పాల్గొన్నారు.
- 2023 మే 05న మంచిర్యాలలో నిర్వహించిన సీపీఐ రాష్ట్ర మహాసభలకు హాజరయ్యారు. సింగరేణి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీపీఐ తలపెట్టిన ఉద్యమంలో భాగంగా బెల్లంపల్లి రీజియన్‌లోని బొగ్గు బావులను సందర్శించి కార్మికుల కష్టసుఖాలను తెలుసుకున్నారు.
- ఈ ఏడాది జూలై 8న ధూంధాం వ్యవస్థాపకుడు అంతడుపుల నాగరాజ్ సోదరి రాణి వివాహానికి చివరిసారిగా మంచిర్యాల జిల్లా మందమర్రికి వచ్చిన గద్దర్ రోజంతా గడిపారు. క్యాతన్‌పల్లి సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. జిల్లాలోని కళాకారులు ఆయనను కలిసి ఫొటోలు దిగారు.
- 1977 ప్రాంతంలో ఎమర్జెన్సీని ఎత్తివేసిన తర్వాత విప్లవోద్యమ విస్తరణలో భాగంగా బెల్లంపల్లిలో జననాట్యమండలి సాంస్కృతిక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆ సాంస్కృతిక బృందానికి నాయకత్వం వహించిన గద్దర్ తొలిసారిగా బెల్లంపల్లికి వచ్చారు. విప్లవ పాటలతో ఈప్రాంత యువతను విశేషంగా ఆకర్శించారు. ఆ తర్వాత అనేక మంది యువకులు పోరుబాట పట్టారు.
- ప్రజా పోరాటాలు నిర్వహించి విప్లవోద్యమంలో అనేకమంది అమరులయ్యారు. వారి స్మారకార్థం బెల్లంపల్లి టేకులబస్తీ ప్రాంతంలో ప్రధాన రహదారిని ఆనుకుని అమరుల స్మారక స్థూపం నిర్మించారు.1990, ఏప్రిల్ 22న గద్దర్ దానిని ఆవిష్కరించారు.
- ఈ ఏడాది మేలో ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో బెల్లంపల్లిలో ప్రజాకవి గూడ అంజయ్య యాదిలో సాంస్కృతిక సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గద్దర్ ఆటపాటలతో అలరించారు.



బెల్లంపల్లిలో కెమికల్ భవనాల పరిశీలన



మంచిర్యాలలో టీ తాగుతూ..

గద్దర్ కలయిక ఆత్మస్థైర్యం నింపింది



ఆసిఫాబాద్‌లో గద్దర్‌తో ప్రజాసంఘాల నాయకులు (ఫైల్)

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని లుంబిని దీక్షా భూమిలో 2017 అక్టోబర్ 14న నిర్వహించిన టీమాస్ కార్యక్రమానికి గద్దర్ హాజరయ్యారని, ఆయన కలయిక తమలో ఆత్మస్థైర్యం నింపిందని ప్రజాసంఘాల నాయకులు గొడిసెల కార్తీక్, దుర్గం దినకర్, కేశవ్‌రావు, శాంతికుమారి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో వారు 'సాక్షి'తో మాట్లాడారు. 'గద్దర్ మరణవార్త దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆయనను కలిసిన సందర్భాన్ని జీవితాంతం గుర్తు పెట్టుకుంటాం' అని వారు పేర్కొన్నారు.

20ఏళ్ల అనుబంధం

సిర్పూర్(టి): ప్రజా గాయకుడు గద్దర్‌తో 20 ఏళ్ల అనుబంధం ఉందని సిర్పూర్(టి) మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ, విద్యార్థి నాయకుడు దుర్గం భాస్కర్ తెలిపారు. 2017 ఏప్రిల్‌లో జరిగిన తన వివాహంలో గద్దర్ పెళ్లిపెద్దగా వ్యవహరించారని, ఆయనతో అనుబంధం మర్చిపోలేనిదన్నారు. 'నక్సలైట్ కంటే ఆయన గొప్ప అంబేద్కర్ వాది. గద్దర్ లేని లోటు తీర్చలేదు.' అని భాస్కర్ తెలిపారు.

ఆదిలాబాద్‌తో ఆత్మీయానుబంధం

తొలిసారిగా ఇంద్రవెల్లికి ...

కైలాస్‌నగర్: తెలంగాణ భాషా, యాస, గోసను తన పాటల ద్వారా కళ్లకు కట్టేలా చాటి చెప్పిన గద్దర్‌కు అమరవీరుల పురిటిగడ్డగా చెప్పుకునే ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపానికి ఎంతో ప్రాధాన్యతనిచ్చేవారు. తొలిసారిగా 1984 ఏప్రిల్ 20న అమవీరుల వర్ధంతికి నివాళులర్పించేందుకు బయల్దేరగా, పోలీసులు గుడిహత్నూర్‌లోనే అడ్డుకుని వెనక్కి పంపారు. అప్పట్లో సంచలనం రేకెత్తించింది. 1989లో మర్రి చెన్నారెడ్డి సీఎంగా ఉన్న సమయంలో జరిగిన అమరవీరుల వర్ధంతిని 50వేల మందితో నిర్వహించగా ఈ కార్యక్రమంలో గద్దర్ ప్రత్యేక అతిథి, వక్తగా హాజరయ్యారు. అప్పటి నుంచి ఆదిలాబాద్ జిల్లాకు ఏ సందర్భంలో వచ్చినా ఇంద్రవెల్లి అమవీరుల స్తూపం వద్ద నివాళులర్పించి తన ఉద్యమ స్ఫూర్తిని చాటి చెప్పేవారని స్థానిక ఉద్యమకారులు గుర్తు చేసుకుంటున్నారు.

- కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత దివంగత సామల సదాశివ మాస్టర్‌తో గద్దర్‌కు మంచి స్నేహబంధం ఉంది. జిల్లాకు వచ్చినప్పుడు విద్యానగర్‌లోని సదాశివ మాస్టర్ ఇంటికి వెళ్లి స్నేహపూర్వకంగా గడిపేవారు. వారిద్దరు సాహిత్యం, తెలంగాణ ఉద్యమంపై మాట్లాడుకునేవారని సదాశివ కుటుంబీకులు తెలిపారు.
- 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అభ్యర్థి గండ్రత్ సుజాత తరఫున ఆయన ఎన్నికల ప్రచారానికి హాజరయ్యారు. నటి కుష్బూతో కలిసి ఎరోడ్రమ్ నుంచి ఎన్టీఆర్‌చౌక్ వరకు నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ ఠాణాలో కేసు..

ఆసిఫాబాద్: గద్దర్‌పై ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. 2005లో నాటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి మావోయిస్టులపై నిషేధం ఎత్తివేయడంతో మండలంలోని మోవాడ్‌లో అమరవీరుల స్తూపాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి గద్దర్ హాజరయ్యారు. ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోలీసులకు వ్యతిరేకంగా గద్దర్ పాటపాడారు. అప్పటి బెల్లంపల్లి అదనపు ఎస్పీ స్టీఫెన్ రవీంద్ర ఆదేశాల మేరకు గద్దర్‌పై ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కుమురంభీం వర్ధంతి కార్యక్రమాలకు సైతం గద్దర్ మూడు, నాలుగు సార్లు హాజరయ్యారు. 2008లో జోడేఘాట్‌కు వెళ్తున్న గద్దర్‌ను కెరమెరి మండలం హట్టి వద్ద అడ్డుకున్నారు.

నిర్మల్ యాదిలో..

నిర్మల్: నిర్మల్ జిల్లాకేంద్రంలో అమరవీరుల స్తూపం, రాంజీగోండు సహా వెయ్యిమంది అమరుల స్తూపం, రాంజీ విగ్రహాన్ని గద్దర్ ప్రారంభించారు.

పద్మశాలీలు అన్నిరంగాల్లో రాణించాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి



పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌అర్బన్: పద్మశాలీలు అన్నిరంగాల్లో రాణించాలని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని వడ్డెపల్లి గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన పద్మశాలి సంఘం జిల్లా కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బీఆర్‌ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి అరిగెల నాగేశ్వర్‌రావుతో కలిసి హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి మార్కండేయస్వామికి పూజలు చేశారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇరుకుల ఆంజనేయులు, మల్లయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, మురళీకృష్ణ, రాజయ్య, సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న సంఘ భవనానికి రూ.50లక్షల తోపాటు స్థలం కొనుగోలుకు రూ.5లక్షలు ఇచ్చినట్లు గుర్తు చేశారు. కొండాలక్ష్మణ్ బాపూజీ విగ్రహం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. వాంకిడి మండల కేంద్రంలో బాపూజీ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీజీవో సంఘం అధ్యక్షుడు శ్యాంనాయక్, ఎంపీపీ మల్లికార్జున్, ఏఎంసీ చైర్మన్ మల్లేశ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకన్న, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, నాయకులు కనకయ్య, గుండా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

'ఆదివాసీలను బెదిరిస్తే ఊరుకోం'



వేదికపై ఐక్యత చాటుతున్న ఆదివాసీ సంఘాల నాయకులు

కౌటాల(సిర్పూర్): ఆదివాసీలను బెదిరిస్తే చూస్తూ ఊరుకోమని డీసీఎంఎస్ వైస్ చైర్మన్, ఐటీడీఏ డైరెక్టర్ కుమురం మాంతయ్య అన్నారు. కౌటాల మండల కేంద్రంలోని జగదాంబ గార్డెన్స్‌లో ఆదివారం కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాల ఆదివాసీలతో ఏర్పాటు చేసిన 'ఆదివాసీల రాజకీయ చైతన్య సభ'లో మాట్లాడారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అనుచరులు ఆదివాసీలపై బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మరోసారి తమ జోలికొస్తే సహించేది లేదన్నారు. పెసా, 1/70 చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు కుట్ర చేస్తే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. త్వరలోనే కాగజ్‌నగర్‌లో ఆదివాసీల భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ నెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సభలో మన్నెవార్ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పారిపెల్లి పోశం, జిల్లా అధ్యక్షుడు మెర్పల్లి బ్రహ్మయ్య, నాయకులు సదాశివ్, సకారం, అనిల్, కుర్మ రాజు, బాపు, చరందాస్, పత్రు, భగవంత్‌రావు, పోచాని, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో దోమల మోత



ఈ ఫొటోలో కనిపిస్తోంది కౌటాల మండల కేంద్రంలోని ప్రగతి కాలనీ. ఈ కాలనీలో ఉద్యోగులు, వ్యాపారులుతోపాటు సాధారణ ప్రజలు నివాసం ఉంటారు. ఇళ్ల మధ్య ఖాళీ స్థలంలో నిల్వ నీరు దోమలకు ఆవాసంగా మారింది. ఫాగింగ్ చేపట్టకపోవడంతో రాత్రంతా దోమలతో ప్రజలు జాగారం చేయాల్సి వస్తోంది.



కౌటాల మండలం శీర్షా గ్రామంలో నిలిచిన మురుగు

- నెలరోజులుగా సమ్మెలో కార్మికులు
- మురుగునీటి నిల్వతో దోమలు, ఈగలు వృద్ధి
- ఫాగింగ్ మిషన్లు ఉన్నా.. లేనట్లే!
- అవస్థలు పడుతున్న ప్రజలు

కౌటాల(సిర్పూర్): జిల్లాలోని 15 మండలాల్లో 335 గ్రామ పంచాయతీలు ఉండగా 800లకు పైగా గ్రామాలు ఉన్నాయి. 4.50 లక్షలకు పైబడి జనాభా ఉంటుంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాలతోపాటు మండల కేంద్రాల్లోని ఖాళీ స్థలాల్లోకి మురుగు నీరు చేరింది. పంచాయతీ కార్మికులు సమ్మెలో ఉండటంతో చెత్తాచెదారం పేరుకుపోయి పందుల ఇష్టారీతిన సంచరిస్తున్నాయి. మురుగునీటిలో దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయి.

వానలకు పెరిగిన దోమల తీవ్రత..

ఖాళీ స్థలాలు మురుగునీరు, పల్లెల్లో చెత్తాచెదారం పేరుకుపోయి పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారడంతో దోమల బెడద తీవ్రంగా ఉంది. వర్షాకాలం మొదలైనా గ్రామాల్లో దోమల మందు పిచికారీ చేసిన దాఖలాలు లేవు. ఫాగింగ్ మిషన్లు అందుబాటులో ఉన్నా అధికారులు వాటిని వినియోగించడం లేదు. దీంతో సీజనల్ వ్యాధులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. 335 పంచాయతీలకు గతంలో 215 జీపీలకు ఫాగింగ్ మిషన్లు అందించారు. మిగిలిన గ్రామ పంచాయతీలు అందుబాటులో ఉన్న పంచాయతీల నుంచి యంత్రాలను తెచ్చుకుని వినియోగించుకోవాలని అధికారులు ఆదేశించారు. కానీ చాలా పంచాయతీల్లో ఫాగింగ్ యంత్రాలు చెడిపోయాయని, మరమ్మతులు చేసిన తర్వాతే దోమల నివారణ చర్యలు చేపడతామని సిబ్బంది చెబుతున్నారు. ఇటీవల విస్తారంగా కురిసిన వర్షాలకు ఎక్కడిక్కడ మురుగు నిలిచింది. దోమలు, ఈగలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర రోగాలు వ్యాప్తి చెందుతున్నాయి. ప్రజలకు రాత్రిపూట కంటి మీద కునుకు లేకుండా గడుపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 1,212 మంది పంచాయతీ పారిశుధ్య కార్మికులు నిరవధిక సమ్మెలో ఉన్నారు. కనీసం బ్లీచింగ్ చల్లేవారు లేరనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం దోమ తెరలు ఉచితంగా పంపిణీ చేయడంతోపాటు దోమల నిర్మూలన చర్యలు చేపట్టాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

పారిశుధ్య పనులు చేయిస్తున్నాం

పంచాయతీ కార్మికులు సమ్మెలో ఉండడంతో పారిశుధ్య పనులు చేయించేందుకు ఇబ్బందవుతోంది. 748 మంది ప్రైవేట్ వ్యక్తులతో నిత్యం పారిశుధ్య పనులు చేయిస్తున్నాం. బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్నాం. నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్ బాల్స్ వేసి దోమల వృద్ధిని అరికడతాం. ఓపెన్ ప్లాట్ల యజమానులకు నోటీసులు అందిస్తాం.

– సురేశ్‌బాబు, డీఎల్‌పీవో, కాగజ్‌నగర్

క్లుప్తంగా

ముంబై రోడ్డు ప్రమాదంలో కవ్వాల్ వాసి మృతి


అనంతి మృతదేహం

జన్నారం: ఉపాధి కోసం ముంబై వెళ్లిన వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో కవ్వాల్‌లో విషాదం నెలకొంది. కుటుంబీకుల వివరాల ప్రకారం... మండలంలోని కవ్వాల్ గ్రామానికి చెందిన సంకె అనంతి (58) నాలుగేళ్ల నుంచి ముంబాయికి ఉపాధి కోసం వెళ్తున్నాడు. ఆయనకు భార్య ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఆదివారం పనికి వెళ్లే క్రమంలో కారు అతివేగంగా ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అక్కడున్న కవ్వాల్ గ్రామస్తులు మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువస్తున్నారు.

గల్ఫ్‌లో నాగసముద్రం వాసి మృతి


వీరయ్య మృతదేహం

దండేపల్లి: మండలంలోని నాగసముద్రం గ్రామానికి చెందిన దేవ వీరయ్య(55) ఉపాధి నిమిత్తం గత కొన్నేళ్లుగా సౌదీలోని రియాజ్‌కు వెళ్లారు. ఈ నెల ఒకటో తేదీన వీరయ్య అక్కడ గుండెపోటుతో మృతిచెందాడు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు ప్రభుత్వాన్ని వేడుకున్న పట్టించుకోలేదు. దీంతో గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి నాయకులు మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించడంలో ప్రత్యేక చొరవ చూపించారు. చనిపోయిన ఐదు రోజుల్లోనే మృతదేహాన్ని ఆదివారం స్వగ్రామానికి తెప్పించి అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. వీరయ్య అంత్యక్రియల్లో గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు భూమయ్య, వర్కింక్ ప్రెసిడెంట్ తిరుపతితో పాటు జన్నారం, నాయకులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లు అరెస్టు

వాంకిడి: మండలంలోని ఖమాన గ్రామ శివారులో ఆదివారం పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురు పేకాటరాయుళ్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.12వేల నగదు స్వాధీన పర్చుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ముగ్గురిపై కేసు..


సిర్పూర్(టి): మండలంలోని పెద్దబండ గ్రామ సమీపంలోని భీమన్న ఆలయం వద్ద పేకాటాడుతున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు సిర్పూర్(టి) ఎస్సై డీకొండ రమేశ్ ఆదివారం తెలిపారు. వారి రూ.10వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

పంట ధ్వంసం చేసిన వారిపై కేసు

నెన్నెల: గుండ్లసోమారం గ్రామానికి చెందిన రత్నం మల్లయ్య, రత్నం అరుణ్‌కుమార్‌లపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్యాం పటేల్ తెలిపారు. అదే గ్రామానికి చెందిన రత్నం పోశంకు చెందిన చేనులోని పత్తి మొక్కలను ధ్వంసం చేయడంతో పాటు, చంపుతామని బెదిరింపులకు గురి చేయడంతో బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

మొన్న ఉధృతంగా.. నేడు బోసిగా


మొన్న.. ఎల్లంపల్లి గేట్ల ఎత్తివేతతో ఉధృతంగా గోదావరి


నేడు.. ఎల్లంపల్లి గేట్లు మూయడంతో బోసిపోయిన గోదావరి

ఎల్లంపల్లి ప్రాజెక్ట్ మూడు గేట్లు ఎత్తి వరదనీటిని దిగువకు వదులుతున్నారు. మొన్న అంటే గత నెల 27వ తేదీ ముందు గోదావరి ఉగ్రరూపంలో కనబడింది. దాదాపు 58 గేట్ల ఎత్తివేతతో ప్రాజెక్ట్ దిగువ భాగాన గోదావరి ప్రవాహం ఉధృతంగా కనిపించింది. ఇప్పుడు కేవలం మూడు గేట్లు ఎత్తివేయడంతో ప్రాజెక్ట్ దిగువ భాగం గోదావరి నీటి ప్రవాహం తగ్గి బోసిపోయి కనిపిస్తోంది. – మంచిర్యాలరూరల్(హాజీపూర్)

ఆధునిక హంగులతో రైల్వే అభివృద్ధి

- వర్చువల్ ద్వారా ఏబీఎస్ఎస్ ప్రారంభించిన ప్రధాని
- ఆదిలాబాద్ రైల్వేస్టేషన్‌లో మెరుగైన వసతులు
- ఇదివరకే ఫిట్‌లైన్, రైల్వే బ్రిడ్జిల మంజూరు
- ఆదిలాబాద్ – ఆర్మూర్ రైల్వే లైన్ దిశగా అడుగులు
- రాష్ట్రంలోనే నంబర్‌వన్ స్టేషన్‌గా మార్చేందుకు చర్యలు
- ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ సోయం బాపూరావు


పథకాన్ని ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ


మాట్లాడుతున్న ఎంపీ

ఆదిలాబాద్: జిల్లాలోని రైల్వేస్టేషన్‌ను అత్యాధునిక హంగులతో అభివృద్ధి చేయనున్నట్లు ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు సోయం బాపూరావు అన్నారు. ఇటీవల ఆదిలాబాద్ రైల్వేస్టేషన్ అమృత్ భారత్ స్టేషన్ పథకం (ఏబీఎస్ఎస్) కింద ఎంపిక కాగా, ఆదివారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైల్వే అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతుందన్నారు. ప్రయాణికుల సమస్యలను దూరం చేసేలా ముందడుగు వేస్తుందని పేర్కొన్నారు. గతంలోని ప్రభుత్వాలు జిల్లాలో రైల్వే వ్యవస్థను పూర్తిగా విస్మరించాయని తెలిపారు. ఇందులో భాగంగానే ప్రస్తుతం ఆదిలాబాద్ రైల్వేస్టేషన్ అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ఎంపిక కావడం గొప్ప విషయమన్నారు. 'అమృత్ భారత్ పథకం' కింద దేశ వ్యాప్తంగా 508 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తుందని, ఇందులో భాగంగా ఆదిలాబాద్ రైల్వేస్టేషన్ రూ.17.8 కోట్లతో అభివృద్ధి జరగనుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్డీఎం రితీష్ కుమార్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి, నాయకులు మయూర్ చంద్ర, విజయ్ భోయర్ పాల్గొన్నారు.

త్వరలోనే మరో శుభవార్త..

జిల్లా ప్రజలకు ఎనిమిది రోజుల్లో మరో శుభవార్త చెప్పడం జరుగుతుందని ఎంపీ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజల చిరకాల వాంఛ అయిన ఆదిలాబాద్ – ఆర్మూర్ రైల్వే లైన్ దిశగా అడుగులు వేయడం జరుగుతుందన్నారు. ఈ విషయమై రైల్వే లైన్ గురించి విజ్ఞప్తులను కేంద్రం దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. ఈ రైల్వే నిర్మాణం పూర్తయితే ప్రయాణికులకు దూరభారం తగ్గడంతో పాటు ఎన్నో నూతన రైళ్ల రాకపోకలు జిల్లా మీదుగా సాగుతాయని తెలిపారు. ఆదిలాబాద్ రైల్వే స్టేషన్‌ను రాష్ట్రంలోనే నంబర్ వన్ స్టేషన్‌గా మార్చేందుకు చర్యలు చేపడుతున్నామని అన్నారు.

ప్రణాళిక ప్రకారం ముందుకు

ఆదిలాబాద్ రైల్వేస్టేషన్ అభివృద్ధికి అధికారులతో కలిసి ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతున్నాం. అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ పథకం ద్వారా రైల్వే స్టేషన్‌లో అధునాతన సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. దీంతో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంతో స్థానికంగా ఉన్న యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

– జీవీ రమణ, దక్షిణమధ్య రైల్వే బోర్డు మెంబర్

మోడీ హయాంలో రైల్వే అభివృద్ధి

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ హయాంలో రైల్వే రూపు రేఖలు మారి అనేక రకాలుగా అభివృద్ధి జరిగింది. ముఖ్యంగా ఆదిలాబాద్ రైల్వే స్టేషన్ ఎంతో ఆధునీకరించబడింది. ప్రస్తుతం ఏబీఎస్ఎస్ ద్వారా మరో అడుగు అభివృద్ధి వైపు పడింది. గతంలో జిల్లా వాసులు నాసిరకమైన సదుపాయాలతో ఎన్నో తిప్పలు పడేవారు. ప్రస్తుతం ఆ సమస్యలన్నీ తొలగిపోయాయి.

– పాయల్ శంకర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు, ఆదిలాబాద్

మృతుడి కుటుంబానికి స్నేహితుల సాయం


సాయం అందిస్తున్న స్నేహితులు

లక్సెట్టిపేట: రామకృష్ణాపూర్‌లో పోలీసు ఉద్యోగం చేస్తూ వడదెబ్బతో మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి అతడి మిత్రులు స్నేహితుల దినోత్సవం సందర్భంగా బాసటగా నిలిచారు. మండల కేంద్రానికి చెందిన కానిస్టేబుల్ ముత్తే సంతోష్ రామకృష్ణాపూర్‌లో విధులు నిర్వహిస్తూ మే నెలలో వడదెబ్బకు గురై మృతి చెందాడు. 2000లో పదో తరగతి బ్యాచ్‌కు చెందిన స్నేహితులు రూ.2లక్షలు పోగు చేసి ఆదివారం కానిస్టేబుల్ తల్లి ముత్తే అనసూయమ్మకు అందజేశారు. కలిసి చదువుకున్న మా స్నేహితుడు మా మధ్యన లేక బాధకరంగా ఉందని, తమవంతుగా కుటుంబానికి అండగా నిలువాలని ఉద్దేశంతో ఈ సాయం అందించినట్లు బోయ శ్రీను, బుద్దె రవి, శ్రీను, రమేశ్, సంపత్, రవి, శుభాష్ భూమన్న, శంకర్, వెంకటేశ్వర్లు తెలిపారు.

లంబాడాల హక్కుల సాధనకు ఉద్యమించాలి


మాట్లాడుతున్న అధ్యక్షుడు శంకర్‌నాయక్

పాతమంచిర్యాల: లంబాడా గిరిజనులు ఐకమత్యంగా ఉండి హక్కుల సాధన కోసం ఉద్యమించాలని లంబాడా జేఏసీ నాయకులు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బాయ్స్ హైస్కూల్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా లంబాడి గిరిజన సంఘాల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ ప్రధాన కార్యదర్శి రామారావు, జిల్లా జేఏసీ అధ్యక్షుడు సభావత్ శంకర్‌నాయక్ మాట్లాడా రు. వివిధ సంఘాలుగా ఉన్న లంబాడీ నాయకులు ఐక్యంగా ఉండి అభివృద్ధి కోసం పోరాడాలన్నారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా జేఏసీ నాయకులను ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సభావత్ శంకర్‌నాయక్, ఉపాధ్యక్షులుగా రాథోడ్ రమేష్, రవికుమార్, ప్రకాష్, రాజు, శివకుమార్, ప్రధాన కార్యదర్శిగా భూక్య రాజేష్, 25మంది కార్యవర్గ సభ్యులు, ఏడుగురు కోఆప్షన్ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జేఏసీ ముఖ్య సలహాదారుల జాదవ్ గోపాల్ రావు, ఉపాధ్యక్షులు శేషారావు, సంయుక్త కార్యదర్శి రాథోడ్ మహేందర్ పాల్గొన్నారు.

ఆస్పత్రి నిర్మాణంపై సంబంధం లేదనడం సిగ్గుచేటు

- మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ సభ్యుడు ప్రేమ్‌సాగర్‌రావ్


మాట్లాడుతున్న ఏఐసీసీ సభ్యుడు ప్రేమ్‌సాగర్‌రావ్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో ముంపునకు గురవుతున్న మాత శిశు కేంద్రం ఆస్పత్రి నిర్మాణంపై నాకు ఎలాంటి సంబంధం లేదని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావ్ అసెంబ్లీ సాక్షిగా మాట్లాడడం సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్సీ ఏఐసీసీ సభ్యుడు కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావ్ మండిపడ్డాడు. ఆయన నివాస గృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ఈ నెల 4న కాంగ్రెస్ ఎమ్మెల్యే బట్టి విక్రమార్క మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్మించిన మాత శిశు కేంద్రం వరుసగా మూడు సార్లు ముంపునకు గురైందని, ప్రభుత్వం, స్థానిక ప్రజానిధులు ముందు చూపు లేకుండా కోట్లాది రూపాయలతో నిర్మించిన ఆస్పత్రి గోదావరిలో కలిసి పోయిందన్నారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే అది టీఆర్ఎస్ అధికారంలో నిర్మించింది కాదని, మాకు ఎలాంటి సంబంధం లేదని అసెంబ్లీ సాక్షిగా మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు మాతాశిశు కేంద్రం మంజూరైందని వివరించారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే మాతాశిశు కేంద్రం పనులు ప్రారంభమయ్యాయని వివరించారు. అంతకు ముందే 2016లో కలెక్టరేట్ కార్యాలయం నిర్మించేందు ఆర్అండ్‌బీ అధికారులు భూ పరిక్షలు నిర్వహించి ఈ స్థలంలో కలెక్టర్ కార్యాలయం, ఏ ఇతర ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించేందుకు అనుకూలంగా లేదని తెలిపారన్నారు. అందుకే ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించలేదని, కానీ 24గంటలు వైద్య సేవలందించే ప్రభుత్వాస్పత్రిని ఎలా నిర్మాణం చేశారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ సభ్యురాలు కొక్కిరాల సురేఖ పాల్గొన్నారు.

జరిమానా..

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలో విచ్చలవిడిగా పశువులను నిర్లక్ష్యంగా వదిలిపెట్టిన యజమానులకు కన్నెపల్లి ఎస్సై నరేష్ కౌన్సెలింగ్ నిర్వహించారు. నిర్లక్ష్యంగా వదిలిన పశువుల యజమానులకు గ్రామపంచాయతీ అధికారులు ఆదివారం రూ.500 చొప్పున జరిమానా విధించారు. పశువులపై పట్టింపు లేకుండా వదిలేస్తే గోశాలకు తరలిస్తామని ఎస్సై హెచ్చరించారు.

భూతగాదాల్లో ఇద్దరిపై కేసు

నెన్నెల: భూతగాదాల్లో దమ్మిరెడ్డిపేట గ్రామానికి చెందిన పసుల భీమేష్, పసుల అశోక్‌లపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్యాం పటేల్ తెలిపారు. దమ్మిరెడ్డిపేట శివారులో ఖర్జీ గ్రామానికి చెందిన గెల్లు రాజన్న పత్తి చేనుకు భీమేష్, అశోక్ కంచె వేసి పత్తి విత్తులు పెట్టి ఆక్రమించుకునే ప్రయత్నం చేశారని చెప్పారు. ఆ కంచెను రాజన్న తీసివేయగా గొడ్డలి పట్టుకొని వారిపై దాడికి ప్రయత్నించారని తెలిపారు. డయల్ 100కు కాల్ చేసి సమాచారం ఇవ్వగా పోలీసులు వెళ్లారని, వారిని చూసి పారిపోయారని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

ఎస్‌టీఎఫ్ఐ తరగతులకు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు

ఆసిఫాబాద్‌రూరల్: స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆల్ ఇండియా క్లాసులు చెన్నైలో ఈ నెల 4,5,6లో ఆదివారం వరకు జరిగిన క్లాసులకు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు కేవలం విద్యను అందించడమే కాకుండ సమాజంలో మమేకం కావాల్సిన అవసరం ఉందన్నారు.

అధిక తేమతో పంటలకు చేటు


పత్తి చేనులో నిలిచిన వర్షపు నీరు(ఫైల్)

- వెంటనే జాగ్రత్తలు పాటిస్తే పంటలకు మేలు


జాడి బాపు, ఏడీఏ,చెన్నూర్

చెన్నూర్‌రూరల్: పంట చేళ్లల్లో నీరు ఎక్కువైతే తేమతో పంటలకు నష్టం వాటిల్లనుంది. అధిక తేమతో పంటలు నష్టపోకుండా ఉండాలంటే తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెన్నూర్ ఏడీఏ జాడి బాపు పలు సూచనలు, సలహాలు అందజేశారు. వర్షాలకు పత్తి చేనులో నీరు నిలిస్తే వెంటనే చేనులో నీరు నిల్వకుండా కాలువలు తీసి చేనులోని నీటిని బయటకు పంపించాలి. వర్షాలు తగ్గిన వెంటనే భూమిలో తేమను తగ్గించుకోవడానికి అంతర సేద్యం చేయాలి. వర్షాలు తగ్గిన వెంటనే బురద పదనులో ఎకరాకు 25కిలోల యూరియా 10కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులను వేసుకోవాలి.అలాగే ఎకరానికి సీఓసీ 3గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి. ఒక రోజు తర్వాత స్వర్ణపాల్‌ను కిలో తీసుకొని 150లీటర్ల నీటికి కలిపి ఎకరానికి పిచికారి చేసుకోవాలి. వేరుకుల్లు తెగులు ఆశిస్తే 3 గ్రాముల ఆక్సిక్లోరైడ్ లేదా ఒక గ్రాము కార్బండిజమ్‌ను లీటరు నీటికి కలిపి మొక్క మొదళ్లలో తడపాలి. మొక్కజొన్న పంట అధిక తేమను తట్టుకోలేదు. సాధ్యమైనంత త్వరగా అంతరకృషి చేసుకోవాలి. ఎకరాకు 25కిలోల యూరియా, 10కిలోల పొటాష్ ఎరువును మొక్కల మొదళ్ల దగ్గర వేసుకోవాలి. కాండం తొలిచే పురుగు ఉంటే కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరానికి 3కిలోలు ఆకు సుడుల్లో వేయాలి. పెసర, మినుము పైర్లకు అధిక తేమతో పేనుబంక, లద్దె పురుగు ఆశించే అవకాశం ఉంది. ఎసిఫేట్ 1.5గ్రాములు లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. ఆకుమచ్చ తెగులు నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 3గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. మిరప పంటలో నీరు నిలిస్తే వెంటనే నీటిని కాలువల ద్వారా తొలగించాలి. నారుకుళ్లు తెగులు ఆశిస్తే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. మూడు గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ లేదా రెండు గ్రాముల రిడోమిల్ లీటరు నీటికి కలిపి వారంలో రెండు, మూడు సార్లు పిచికారీ చేయాలి. ఇలాంటి జాగ్రత్తలు పాటిస్తే అధిక తేమ నుంచి పంటలను కాపాడుకోవచ్చు.

23ఏళ్లకు కలుసుకున్నారు..


పూర్వ విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: శ్రీహర్ష జూనియర్ కళాశాలలో చదివి వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు 23ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో 2003–05 బ్యాచ్‌కు చెందిన సీఈసీ విద్యార్థుల పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనాటి అధ్యాపకులు నామసాని సత్యం, పీవీ రావు, విజయ, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ రమేష్, రఘురాంలను ఘనంగా సత్కరించారు.

నిండుకుండలా ఎల్లంపల్లి జలాశయం


ఎల్లంపల్లి ప్రాజెక్ట్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని గుడిపేట గ్రామ శివారులోని గోదావరిపై ఉన్న ఎల్లంపల్లి(శ్రీపాద)ప్రాజెక్ట్ నీటి మట్టం 148 మీటర్ల క్రస్ట్ లెవెల్‌కు 147.48 మీటర్లు ఉండగా మొత్తం 20.175 టీఎంసీలకు 18.735 టీఎంసీల నీటి సామర్థ్యంతో ఉంది. ఇన్‌ఫ్లో 17వేల క్యూసెక్కుల నీరు ప్రాజెక్ట్‌లోకి వచ్చి చేరుతుండగా అవుట్‌ఫ్లో కింద హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 298 క్యూసెక్కుల నీటిని, 3గేట్లు ఎత్తి 9వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు.

వైద్య సిబ్బంది నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

- అక్సిజన్ అందించడంలో సిబ్బంది అలసత్వం
- దిక్కున్న చోట చెప్పుకొమ్మని యాజమాన్యం బెదిరింపులు
- ఆందోళనకు దిగిన బాధిత కుటుంబ సభ్యులు


వైద్యులతో వాగ్వాదానికి దిగిన మృతుడి బంధువులు


చంద్రమౌళి మృతదేహం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేటు ఆస్పత్రి వైద్య సిబ్బంది నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలైంది. ఈ సంఘటన జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఆదివారం చోటుచేసుకుంది. పూర్తి వివరాల్లోకి వెళ్తే... మంచిర్యాలకు చెందిన కొమరవెల్లి చంద్రమౌళి(84) కొద్ది రోజుల నుంచి దగ్గు రావడంతో ఈ నెల 3వ తేదీన స్థానిక ఐబీ చౌరస్తాలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. పరీక్షించిన వైద్యులు ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ ఉందని అడ్మిట్ కావాలని సూచించారు. దీంతో ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. ముందుగానే రూ.30వేలు సైతం బాధితుల నుంచి తీసుకున్నారు. మూడు రోజుల పాటు ఐసీయూలో ఆక్సిజన్ పైనే ఉంచారు. ఆదివారం ఉదయం 10గంటల ప్రాంతంలో ఆక్సిజన్ సిలిండర్ అయిపోగా మరో సిలిండర్ అమర్చే క్రమంలో సుమారు 20నిమిషాల వరకూ ఆలస్యం జరిగింది. దీంతో చంద్రమౌళి ఆక్సిజన్ అందక మృతిచెందాడు. దీంతో బంధువులు ఆస్పత్రి యాజమాన్యంతో వాగ్వాదానికి దిగారు. దిక్కున చోట చెప్పుకొమ్మని ఆస్పత్రి యాజమాన్యం బెదిరింపులకు పాల్పడడంతో బాధితులు 100డైల్‌కు కాల్ చేయడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివాదం సద్దుమనిగించారు. చంద్రమౌళికి భార్య ఈశ్వరమ్మ, కొడుకు శ్రీధర్, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఈ విషయమై స్థానిక సీఐని వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.